ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్ ) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

SUNDAY 29TH MARCH 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 356 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 29 మార్చి 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 356 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

భద్రాచలం,మార్చి28 భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.



## అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం

- జేవర్‌లో దేశంలోనే అతిపెద్ద విమనాశ్రాయం
- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ
- నోయిడా మూఢనమ్మకాన్ని చెరిపేసామని వ్యాఖ్య
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా చర్యలు

న్యూఢిల్లీ,మార్చి 28అక్షరం న్యూస్)మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిఓచిందని మోదీ పేర్కొన్నారు. విపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికొదిలేశారని

➢ మిగతా 2వ పేజిలో..

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్



హైదరాబాద్,మార్చి28అక్షరం న్యూస్) హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన ప్రక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్-2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం

➢ మిగతా 2వ పేజిలో..

## వైభవంగా శ్రీ సీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం



### వేడుకలో పాల్గొన్న గవర్నర్ శుక్లా

భద్రాచలం,మార్చి 28 అక్షరం న్యూస్) భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో జయ జయ నీరాజనాల మధ్య దేవదేవుడికి అర్చకులు సమస్త నదీ జలాలతో అభిషేకం చేశారు. ఈ పుణ్య జలాన్ని భక్తులపై చిలకరించి సమస్త లోకాలు శుభాలతో వర్ధిల్లాలని ఆశీస్సులు పలికారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు.



## మూసీని అడ్డుకుంటే శివతాండవమే

- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

రంగారెడ్డి,మార్చి28: అక్షరం న్యూస్) రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో

➢ మిగతా 2వ పేజిలో..



## పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

- నియామకాల్లో తీరని జాప్యం
- ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి
- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

హైదరాబాద్,మార్చి28అక్షరం న్యూస్)పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా

➢ మిగతా 2వ పేజిలో..



## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం

హైదరాబాద్,మార్చి 28 అక్షరం న్యూస్) ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

➢ మిగతా 2వ పేజిలో..

## మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ

- రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు
- అక్రమాలను సహించేది లేదని వెల్లడి
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్,మార్చి28 అక్షరం న్యూస్) మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు

➢ మిగతా 2వ పేజిలో..

## కంచె చేను మేసినట్లుగా ఉంది

- మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా
- నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది
- మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క

హైదరాబాద్,మార్చి28అక్షరం న్యూస్) అక్రమ మైని ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రా కన్‌స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగి అక్మ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ

➢ మిగతా 2వ పేజిలో..

## ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

➢ మొదటి పేజీ తరువాయి

పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.

## మూసీని అడ్డుకుంటే శివతాండవమే

మూసీ పునరుజ్జీవ నాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

➢ మొదటి పేజీ తరువాయి



ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర

ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

➢ మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్‌ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బడ్జెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బడ్జెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷-లాన్ నిధుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

## మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ

➢ మొదటి పేజీ తరువాయి

అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ

పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

## కంచె చేను మేసినట్లుగా ఉంది

➢ మొదటి పేజీ తరువాయి

బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి.

## 40 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలి లేకుంటే ఉద్యమం తప్పదు శనిగరపు రమేష్



ఓదెల/పెద్దపల్లి మార్చి 28(అక్షరం న్యూస్) 40 పిట్ల రోడ్డుకు మెజర్మెంట్ చేసి 36 ఫీట్లకు కుదించడం ఎవరికి న్యాయం చేయడం కోసం అధికారులు తలెబ్జారని దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని శనిగరపు రమేష్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా శనివారంమీడియాతో మాట్లాడుతూపాత్కపల్లి గ్రామం నుండి రూపునారాయణపేట వరకు రెండువరసల రోడ్డు మంజూరు కావడం జరిగింది దానికి స్థానిక ఎమ్మెల్యే పాత్క పల్లి లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారు.ఆర్ అండ్ బీ అధికారులు వచ్చి ప్రస్తుతం ఉన్న 12 ఫీట్ల సిమెంట్ రోడ్డు కు మద్యలో నుండి ఇరువైపుల 20 ఫీట్ల రోడ్డు కు అనగా రెండు వైపుల మొత్తం 40 ఫీట్ల కు కొలతలు చేసి మార్కింగ్ చేశారు..వెంటనే ఇండ్లు ప్రహారి గోడలు ఆగమేఘాల మీద కూల్చడం జరిగింది. ఒకరిద్దరి కి మేలు చేయడం కోసం అట్టి రోడ్డును 36 ఫీట్ల కు కుదించారు..ఇది ప్రభుత్వం అధికారికంగా తగ్గించారా.లేదా కొందరి సంతోషం కోసం తగ్గించారా మరి ఈ తగ్గింపు వలన ఇప్పటికే ఇండ్లు ప్రహారి గోడలు అనవసరంగా కూల్చి నష్టపోయిన వారికి నష్ట పరిహారం ఎవరు కట్టిస్తారు బాధ్యులు ఎవరు.. ఆర్ అండ్ బీ అధికారుల లేక స్థానిక నాయకుల ఈ విషయంలో నష్టపోయిన వారికి న్యాయం చేయాలని లేకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శనిగరపు రమేష్.

## అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం

➢ మొదటి పేజీ తరువాయి

ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది. దానిని ఉద్దేశించే మోదీ మాట్లాడారు. గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజ్‌వాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోదీజీ నోయిడా వెళ్లొద్దు. మీరు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. అసలు ఈ నమ్మకానికి 1988 జూన్‌లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్‌డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్‌నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడా-దిల్లీని అనుసంధానించే డీఎన్‌డీ రైల్వేను నోయిడా నుంచి కాకుండా దిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం అన్నారు. ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సమిట్‌కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్‌కు చీఫ్‌గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్‌నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢనమ్మకాన్ని పట్టించుకోలేదు. ఆయన 2017లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలుమార్లు ఆ నగరంలో పర్యటించారు. ఆ తర్వాత 2022లో రెండోసారి సీఎంగా గెలిచారు. 2027లో మరో దఫా ఎన్నికలకు వెళ్లనున్నారు. ఇకపోతే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.కార్యక్రమంలో యూపి సిఎం యోగి, కేంద్రమంత్రి రమ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు ఒక బాధ్యతగా పాటించాలి

- రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం లో ఎస్సై డి కొండ రమేష్




ఓదెల/ పెద్దపల్లి మార్చి 28(అక్షరం న్యూస్ )

లిప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను ఒక బాధ్యతగా పాటించాలని పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ పేర్కొన్నారుఈ సందర్భంగా శనివారం కనగర్తి గ్రామంలో రోడ్డు భద్రత మహోత్సవం కార్యక్రమం గ్రామస్తులతో రాలి నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై దికొండ రమేష్ మాట్లాడుతూపెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి మరియు వాహనదారుల్లో క్రమశిక్షణను పెంపొందించడానికి పోత్కపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో 'ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను ఒక బాధ్యతగా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఈ క్రింది కీలక సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారుహెల్మెట్ మరియు సీట్ బెల్ట్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు.

మైనర్ డ్రైవింగ్

: తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ఇది చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనం నడపరాదు:

మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు వర్ణనాతీతమని మద్యం సేవించి బండి నడపడం వల్ల తమ విలువైన ప్రాణాలను కోల్పోవడం వస్తుందని తనపై ఆధారపడ్డ కుటుంబం వీధిన పడే పరిస్థితి ఏర్పడుతుందని గమనించి వీటిని పాటించాలని అన్నారు

ట్రిపుల్ రైడింగ్


బైక్‌లపై ముగ్గురు ప్రయాణించడం ప్రమాదకరమని, అటువంటి చర్యలకు పాల్పడవద్దని కోరారు.రోడ్డు ప్రమాదాల నివారణకు కేవలం పోలీసులు మాత్రమే కాకుండా, ప్రజలు కూడా సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రెడ్డి రజనీకాంత్ తో పాటు పలువురు నాయకులు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు

# గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళా విశ్రాంతి గదుల నిర్మాణానికి భూమిపూజ



జ్యోతి నగర్, ఎన్టిపిసి మార్చి 28: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ ద

ఎన్‌టీపీసీ రామగుండం సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళా విశ్రాంతి గదుల నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా ఎన్‌టీపీసీ రామగుండం పరిధిలోని మొత్తం ఆరు పోలీస్ స్టేషన్లలో మహిళా విశ్రాంతి గదులను నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.75 లక్షలు వ్యయం చేయనున్నారు. మహిళా పోలీస్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతతో పాటు గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ అండ్ టీ) చందన్ కుమార్ సమంతా, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరయ్యారు. హెచ్‌ఓహెచ్‌ఆర్ బిజోయ్ కుమార్ సికందర్‌తో పాటు ఏసీపీలు, డీసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు మరియు సిఎస్ఆర్ బృంద సభ్యులు పాల్గొన్నారు.సమాజ అభివృద్ధి దిశగా ఎన్‌టీపీసీ రామగుండం సంస్థ నిరంతరం చర్యలు తీసుకుంటూ, ముఖ్య సేవలలో పనిచేస్తున్న మహిళలకు అనుకూలమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.



# హైరిస్క్ ప్రెగ్నెన్సీపై అప్రమత్తత అవసరం...

- తల్లి బిడ్డల రక్షణకు సమగ్ర వైద్య పర్యవేక్షణ కీలకం
- కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి

పెద్దపల్లి , మార్చి 28 అక్షరం న్యూస్;

గర్భధారణ కాలంలో తల్లి లేదా కడుపులోని శిశువుకు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తే పరిస్థితిని "హైరిస్క్ ప్రెగ్నెన్సీ"గా పరిగణిస్తారని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ శ్రీనయన, క్రిటికల్ కేర్ నిపుణురాలు డాక్టర్ పల్లవి తెలిపారు. ఇటువంటి సందర్భాల్లో నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీసే అవకాశముండటంతో ముందస్తు జాగ్రత్తలు, నిరంతర వైద్య పర్యవేక్షణ అత్యంత కీలకమని సూచించారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైరిస్క్ గర్భధారణలపై అవగాహన కల్పించారు. గర్భధారణకు ముందే ఉన్న డయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, లివర్, కిడ్నీ సమస్యలు గర్భధారణ సమయంలో తీవ్రమయ్యే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా, గర్భధారణ వల్లే వచ్చే థైరాయిడ్ సమస్యలు, శిశువు బలహీనత, గర్భసంచి బలహీనత వంటి అంశాలు కూడా హైరిస్క్ కేటగిరీలోకి వస్తాయని చెప్పారు. గతంలో ఎక్కువ శస్త్రచికిత్సలు చేయించుకున్న మహిళలు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైరిస్క్ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తూ, ప్రతి దశలో స్క్రీనింగ్‌లు చేయించుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. గైనకాలజిస్టుతోనే కాకుండా అవసరాన్ని బట్టి కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ వంటి విభాగాల వైద్యులు అందుబాటులో ఉండటం వల్ల చికిత్స సులభమవుతుందని తెలిపారు. మెడికవర్ లాంటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో సమగ్ర వైద్య సేవలు లభించడం వల్ల ఇలాంటి క్లిష్ట పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనవచ్చని పేర్కొన్నారు. గర్భిణులు ముఖ్యంగా రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స తీసుకోవడం అవసరమన్నారు. ప్రసవానంతరం తలెత్తే సమస్యలపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాయ (ప్లాసెంటా) డెలివరీకి ముందే వేరుపడటం వంటి ప్రమాదకర పరిస్థితులు, అధిక రక్తస్రావం వంటి సమస్యలు కూడా హైరిస్క్‌లో భాగమేనని హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో గర్భిణులను ఐసీయూలో ఉంచి క్రిటికల్ కేర్ నిపుణులతో పాటు ఇతర విభాగాల వైద్యులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షిస్తే తల్లి, శిశువును సురక్షితంగా కాపాడడం సాధ్యమవుతుందని తెలిపారు. సరైన సమయంలో సరైన చికిత్స అందించడం ద్వారా మరణాలను నివారించవచ్చని చెప్పారు. ఏ చిన్న లక్షణాన్నైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి వైద్యుల సలహాలు పాటిస్తే సురక్షితమైన ప్రసవం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్నాకర్, బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.




# జిల్లాలో 1655 కే ఎల్ ఇంధన నిల్వలు సిద్ధం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



పెద్దపల్లి ప్రతినిధి, మార్చి 28 అక్షరం న్యూస్;

జిల్లాలో పెట్రోల్ (మీః), డీజిల్ (ూణ) నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి తెలిపారు. ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారుల నివేదికల ప్రకారం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందన్నారు.జిల్లాలో మొత్తం 108 పెట్రోల్ బంకులు ఉండగా, రోజువారీ సగటు విక్రయాలు 255 కిలోలీటర్లు నమోదవుతున్నాయని తెలిపారు. ఇందులో పెట్రోల్ 82 ఖూ, డీజిల్ 173 ఖూగా ఉన్నాయి. గడిచిన రోజున 240 ఖూ ఇంధనం విక్రయించబడగా, ఇందులో పెట్రోల్ 78 ఖూ, డీజిల్ 162 ఖూగా ఉన్నాయని పేర్కొన్నారు.ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1655 ఖూ ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇందులో పెట్రోల్ 624 ఖూ, డీజిల్ 1031 ఖూగా ఉన్నాయని తెలిపారు.అన్ని ఆయిల్ కంపెనీలు (ఎూజూ, న్రూజూ, దీూజూ) ద్వారా సరఫరా సాధారణంగా కొనసాగుతోందని, ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని కలెక్టర్ సూచించారు.

# డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బకాయిలు చెల్లించేందుకు మూడు నెలలు గడువు పొడిగింపు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, ప్రతినిధి మార్చి- 28 అక్షరం న్యూస్;

డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బకాయిలు చెల్లించేందుకు మూడు నెలలు గడువు ప్రభుత్వం పొడగించిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2014-15 నుండి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2023-24 వరకు (రబీ 2022-23 సీజన్‌కు సంబంధించిన ాబష్ఱశీఅ ్ఖుసఎ మినహా) బకాయిలు ఉన్న రైస్ మిల్లర్లు, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం 90 రోజుల లోపు ఎఫ్.ఆర్.కే సన్న బియ్యం (ఖీశీఊటఱవస ్ఖుఅఖుఎఱఎఖుఎ) లేదా నగదు రూపంలో బకాయి పరిమాణానికి సమానమైన మొత్తాన్ని 125% తో పాటు 12% వడ్డీతో చెల్లించాలనే ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ గడువు ముగిసిన నేపథ్యంలో, ప్రభుత్వం విషయాన్ని పునఃపరిశీలించి బకాయిల వసూలును వేగవంతం చేయడం, అలాగే తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ ప్రయోజనాలను పరిరక్షించడం కోసం గతంలో ఇచ్చిన గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ మార్చి 25 న ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు ఖీ=ఖ సన్నబియ్యం లేదా నగదు రూపంలో బకాయిలను గడువులోపు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ వెసులుబాటును డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకొని, తమ బకాయిలను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్‌కు గడువు లోపల చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక--మట్టి పర్మిషన్‌ల సమస్య




జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పేదల ఇళ్ల నిర్మాణం ఆగిపోతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి వెంకన్న ఆవేదన అంతర్గాం మండలంలోని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఇసుక, మట్టి అనుమతుల సమస్యల కారణంగా నిలిచిపోతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి వెంకన్న తెలిపారు. పేదల కోసం ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినప్పటికీ, మండలంలోని రెవెన్యూ అధికారులు ఇసుక, మట్టి పర్మిషన్‌ల విషయంలో ఆలస్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.ఇసుక, మట్టి అందుబాటులో లేకపోవడంతో అనేక మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఇసుక, మట్టి సులభంగా దొరికేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని, అవసరమైతే సబ్సిడీతో అందించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.ప్రభుత్వం ఉచితంగా ఇళ్లు ఇస్తున్నామని ప్రకటించినప్పటికీ, పర్మిషన్‌ల కోసం ప్రజలు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ఇతర మండలాల్లో లేని విధంగా అంతర్గాము మండలంలోనే ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు.గ్రామాల్లో ఇసుక, మట్టి తీసుకోవడంలో అధికారులు అనవసరంగా ఇబ్బందులు పెడుతున్నారని, పేదల ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా అధికారులు సహకరించాలని గుమ్మడి వెంకన్న కోరారు. లేనిపక్షంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# కొత్తగూడ లోని ట్రైబల్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కోసం ఎంపికలు



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ మార్చి 29(అక్షరం న్యూస్ )

ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఉన్నటువంటి ట్రైబల్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కొత్తగూడలో ఉన్నటువంటి పాఠశాలలో ఐదవ తరగతి అడ్మిషన్ ప్రక్రియ కోసం మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కొత్తగూడ నందు శనివారం బ్యాటరీ టెస్ట్ నిర్వహించుటకు లిట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు డి దేశి రామ్ నాయక్‌లి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి బ్యాటరీ టెస్ట్ లను ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా తరపున 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని అందులో 10 మంది ములుగు జిల్లా 5 వరంగల్ జిల్లా నుండి 15 మంది మహబూబాబాద్ జిల్లా నుండి ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. ఈ యొక్క బ్యాటరీ టెస్ట్ ప్రక్రియ ఈరోజు నుండి 30 వ తారీకు వరకు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కొత్తగూడ యందు నిర్వహించబడుచున్నవని అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు రాములు జి సి డి ఓ మేడం విజయ, స్పోర్ట్స్ ఆఫీసర్ సిహెచ్ కొమ్మాలు, పాఠశాల హెచ్‌ఎం ఎఫ్ఎసి సుబ్బారావు వ్యాయామ ఉపాధ్యాయులు కోచ్ లు పాల్గొన్నారు .



# ఎన్టీపీసీ చిలకలయ్య గుడిలో శ్రీ సీతారామచంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవం...

జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టీపీసీ చిలకలయ్య గుడిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం శనివారం భక్తి తరంగాలతో మార్మోగింది. శ్రీ సీతారామచంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవాన్ని అశేష భక్తుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నిండా మంగళ వాద్యాల నినాదాలు, వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. హిందూ ఐక్యవేదిక, ఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు కౌశిక్, హరి లత దంపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ శీ ం ా ్వ ద ా ల ం





పొందారు. వట్టాభిషేక వేడుకల సందర్భంగా స్వామివారిని అలంకరించిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని పుణ్యఫలాన్ని పొందారు. ఆలయ పరిసరాలు పండుగ వాతావరణంతో కళకళలాడగా, ఈ మహోత్సవం స్థానికంగా విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రావికంటి వరప్రసాద్, చెప్యాలా రామారావు, అమరేందర్ రావు, కేశవరావు, చెప్యాలా సత్యనారాయణరావు, రావి కంటి ఈశ్వర్, మెరుగు అభిషేక్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్జీ--1లో నిరుద్యోగ యువతకు

# వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ

జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 28: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు సంస్థ చేపడుతున్న కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) కార్యక్రమాల్లో భాగంగా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆర్జీ--1 ఏరియాలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్జీ--1 టిటిసి కేంద్రంలో వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జీ--1 జీఎం డి. లలిత్ కుమార్ 49 మంది నిరుద్యోగ యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన వారికి భారత్‌తో పాటు విదేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. ఆర్జీ--1 టిటిసి కేంద్రంలో ఇప్పటి వరకు 13 బ్యాచ్‌లలో మొత్తం 651 మందికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని, వీరిలో 130 మంది ఇప్పటికే






వివిధ కంపెనీలలో డంప్ ట్రక్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని వివరించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించడంతో పాటు వోల్వో డంప్ ట్రక్ కంపెనీ సహకారంతో సింగరేణి డైరెక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం చంద్రశేఖర్, టిటిసి మేనేజర్ అశోక్ రావు, జివిటిసి మేనేజర్ మాధవ రెడ్డి, పర్సనల్ ఆఫీసర్లు శ్రావణ్ కుమార్, హన్మంతరావు, వోల్వో డంప్ ట్రక్ మేనేజర్ హరిబాబు, వోల్వో శిక్షకుడు సంజీవ్, టిటిసి సిబ్బంది పద్మారావు, సత్తన్న, జివి రావు, ఆయుబ్ పాషా, కృష్ణ తదితరులు మరియు శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

## చిన్న దూరమైనా సీట్ బెల్ట్

# ధరించండి.... ప్రాణ రక్షణలో కీలక పాత్ర

- సీపీ అంబర్ కిషోర్ ఝా
- ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపు లక్ష్యంగా 'అరైవ్ అలైవ్ -- ఫేజ్-XXX' కార్యక్రమాలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చ్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రామగుండం కమిషనరేట్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' ఫేజ్–XXX కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చౌరస్తా వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల ప్రాణ రక్షణ ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని



సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 70 శాతం కేసుల్లో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్లనే తీవ్రమైన గాయాలు లేదా ప్రాణనష్టం జరుగుతున్నట్లు తెలిపారు. సీట్ బెల్ట్ వినియోగం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ఫోర్ వీలర్ వాహనాల్లో ఎయిర్ బ్యాగులు ఉన్నప్పటికీ, సీట్ బెల్ట్ ధరించకపోతే అవి సమర్ధవంతంగా పని చేయవని స్పష్టం చేశారు. కాబట్టి ఎయిర్ బ్యాగులు ఉన్నా లేకపోయినా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనం కొనుగోలు సమయంలో ప్రజలు అధునాతన భద్రతా సదుపాయాలు కలిగిన మోడళ్లను ఎంచుకోవాలని, ముఖ్యంగా ఎయిర్ బ్యాగులు, సీట్ బెల్ట్ రిమైండర్లు వంటి భద్రతా లక్షణాలను పరిశీలించాలని సూచించారు. చిన్న దూరమైనా, పెద్ద దూరమైనా ప్రతి ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకుంటే దాదాపు 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని, ఒకవేళ ప్రమాదం జరిగినా ప్రాణనష్టం లేకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వాహనదారులను సీపీ కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఎస్ఐలు రమేష్, అనూష, మనోహర్, ట్రాఫిక్ ఎస్ఐ హరీష్ శేఖర్, రామరాజు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఎన్టిపిసి నుంచి రేవా కు కార్యాలయ వసతి కల్పించండి.. ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యునికి రేవా నాయకుల విజ్ఞప్తి



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్ టి పి సి విశ్రాంత ఉద్యోగుల కోసం ఎన్టిపిసి యజమాన్యం నుంచి కార్యాలయం కోసం వసతి సౌకర్యాన్ని కల్పించాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాం చందర్ ను ఎన్టీపీసీ అతిథి గృహం లో రేవా నాయకులు కలిసి మెమోరాండం సమర్పించారు. అనేక సంవత్సరాలుగా ఎన్టీపీసీ లో ఉద్యోగం చేసి ఇక్కడి ప్రాంత అనుబంధంతో ఉద్యోగ విరమణ అనంతరం ఇక్కడ నివాసం ఏర్పరచుకున్నారు. వైద్యం, పెన్షన్ ఇతర పనుల నిమిత్తం విశ్రాంత ఉద్యోగులు తరుచుగా రావడం రేవా కార్యాలయం లోవసతి లేక అనేక ఇబ్బందులకు గురి అగుచున్నారు. రేవా కార్యాలయం వసతి , విశ్రాంతి రూమ్ కలసిసంభాషణలు, వార్తాపత్రికలు, పుస్తకాలు చదవడం, క్యారమ్, చెస్ వంటి ఇండోర్ ఆటలు ఆడటం అవసరం. ఇందుకొరకు రేవా కు కార్యాలయ వసతి ఇప్పించుటకు రామచందర్ ను కోరమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆకుల రాశీకిషన్ కార్యదర్శి చెప్యాల శ్రీపతి రావు ఆధ్వర్యములో రేవా సీనియర్ నాయకులు తిరుమల సురేందర్ , దుర్గం నర్సయ్య , మంగళంపల్లి రామ్ నారాయణ , డి ఎన్ పోచయ్య, డి లాలయ్య , కొమ్ము గోపాల్, సాంబ మూర్తి ఇతరులు పాల్గొన్నారు.

## కాజిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా ఈసీసీఈ డే నిర్వహణ



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చ్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం మాతంగి కాలనీ--4లోని కాజిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే (ఝుతీశ్రీఎ జఫ్త్రఱశ్రీనఫ్త్రశీశీ ఝుతీవ ఖఅఎ జుఎబఝ్ఞఅశీఅ ఋఎ) కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.


ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ నృత్యాలు చేసి అందరిని ఆకట్టుకున్నారు. పిల్లల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సందడి మధ్య కొనసాగింది. చిన్నారుల విద్య, ఆరోగ్యం, సంస్కారం అనే మూడు అంశాలపై అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో ముఖ్యమని అతిథులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 23వ డివిజన్ కార్పొరేటర్ బెంద్రం సువిత రాజిరెడ్డి, 24వ డివిజన్ కార్పొరేటర్ కొలాని కవిత వెంకట రెడ్డి హాజరయ్యారు. అలాగే ఐసీడీఎస్ సూపర్వైజర్ మమత పాల్గొని చిన్నారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు స్వప్న, పద్మ, సుజాత కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ తల్లిదండ్రులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈసీసీఈ డే నిర్వహణ ద్వారా చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందడమే కాకుండా, తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యా అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు

## తెలంగాణకు మళ్లీ సీఎంగా కేసీఆర్ రావాలి

- శ్రీ వెంకటేశ్వర స్వామివారినీ వేడుకున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తెలంగాణ రాష్ట్రానికి మళ్లి కేసీఆర్ సిఎంగా రావాలని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని వేడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారు ఎడువారాల తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనంలో భాగంగా నాలుగవ శనివారం తిరుపతి అలపిరి మెట్ల ద్వారా నడక మార్గానా



తిరుమల చేరుకుని తలనీలాలు స్వామి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ రాక్షస పాలన నుండి ప్రజలను విముక్తి చేసి మళ్లీ తెలంగాణ సీఎంగా కేసీఆర్ రావాలని కోరారు. తెలంగాణ జాతిపిత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు 10 ఎళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం అందించారని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి లో దూసుకుపోయుందని దేశానికి ఆదర్శంగా తెలంగాణను మార్చిన ఘనత కేసీఆర్కే దక్కుతుందన్నారు. రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గా ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించాలని, నన్ను నమ్ముకున్నా వారి బాధలు తీర్చే శక్తిని స్వామి వారు ప్రసాదించాలన్నారు. రామగుండం నియోజకవర్గం లోని సకల జనుల ప్రజల బాధలు సమస్యలు పరిష్కారం కావాలని ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండే విధంగా ఆశీర్వదించాలని స్వామి వారి వేడుకున్నానట్లు తెలిపారు.

# ప్రజలు ప్రశ్నించే గొంతుగా మారాలి

- ప్రజా హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తాం
- సామాజికవేత్తలు డాక్టర్ జనగామ రవి, కొలిపాక శ్రీనివాస్

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 28 అక్షరం న్యూస్;
ప్రజలకు సమాచార హక్కు ఒక శక్తివంతమైన ఆయుధమని, ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభుత్వాలు మరియు ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు వినియోగించుకోవాలని సామాజిక నాయకులు పిలుపునిచ్చారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన నాయకులు భూకబ్జాలు, అవినీతి చర్యలకు పాల్పడితే ప్రజలు ప్రశ్నించాలని పేర్కొన్నారు.ఈ మేరకు సామాజిక నాయకులు డాక్టర్ జనగామ రవి (పెద్దపల్లి జిల్లా) మరియు కొలిపాక శ్రీనివాస్ (బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా) సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నోట్లకు కాకుండా నోటికి విలువ ఇచ్చి ఓటు వేయాలని, ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు బలంగా వినిపించాలంటే ప్రశ్నించే సంస్కృతి అవసరమని పేర్కొన్నారు.దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల పెంపు వల్ల నిరుద్యోగులు, నిరుపేదలకు ప్రత్యక్ష లాభం ఉండదని అన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను డబ్బులతో ప్రభావితం




చేయడం వ ల్ల ప్రజాస్వామ్యం బలహీనపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రజా ధనం వృథా అవుతున్న అంశాలపై కూడా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

పార్లమెంటులో ప్రజా హక్కుల అంశంపై ప్రతిపక్ష ఎంపీ రాఘవ చంద్ర ప్రభుత్వం ను ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి మంచి సంకేతమని పేర్కొన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో సమర్పించే ఆస్తుల వివరాలపై ఎన్నికల అనంతరం అవినీతి నిరోధక సంస్థల ద్వారా విచారణ జరపాలని కోరుతూ త్వరలోనే న్యూఢిల్లీ లోని ఎన్నికల సంఘాన్ని కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు.దేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఇచ్చే పెన్షన్లను రద్దు చేయాలని, నిరుద్యోగులు మరియు నిరుపేద కుటుంబాలకు మరింత సహాయం అందించే విధంగా విధానాలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వృద్ధులు, వికలాంగులకు నెలకు రూ.5000 పెన్షన్ అందించేలా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో నిరుద్యోగ నిరుపేద కుటుంబ యజమాని మరణిస్తే రూ.5 లక్షల బీమా అందించే నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను అభినందించారు. ప్రభుత్వ పథకాలలో అనర్హులు లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్ ద్వారా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ లో ఏర్పడిన లీకేజీలను అక్కడే కూర్చొని మరమ్మత్తులు చేపించిన మేయర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చ్ 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
నీటి సరఫరా పైప్ లైన్లలో లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి గారు అన్నారు. శారదా నగర్ పి జి కళాశాల ఎదుట డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ లలో ఏర్పడిన లీకేజీలను మరమ్మత్తు చేస్తున్న పనులను శనివారం ఆయన అక్కడే కూర్చొని పర్యవేక్షించారు. లీకేజీ కారణంగా ప్రశాంత్ నగర్ నుండి పవర్ హౌజ్ కాలనీ వరకు దాదాపు నాలుగు డివిజన్ లలో నీటి సరఫరా కు అంతరాయం ఏర్పడినందున సాయంత్రం లోపు మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రేపటి నుండి నీటి సరఫరా యధాతథంగా కొనసాగాలని ఆదేశించారు. లీకేజీ ఎవరు గుర్తించినా ఫోన్ నెం . 9392483959 కు సమాచారం లేదా ఫోటో తీసి లొకేషన్ వాట్సాప్ చేయాలని అన్నారు. మునిసిపల్ సేవలకు సంబంధించి ఏ లోపం తలెత్తినా పై నెంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు కూడా నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అన్నారు. ప్రతి కనెక్షన్ కు నీటి సరఫరా నిలిపివేసే వాల్వ్ అమర్చుకోవాలని సూచించారు. ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని వేసవి కాలంలో నీటి కొరత ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.



## సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఆర్ బీ శాఖ అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి ప్రతినిధి, మార్చి-28 అక్షరం న్యూస్;
ఆర్‌డబీ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆర్‌డబీ శాఖ అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి పెద్దపల్లి కాటారం పరిధిలో జరుగుతున్న రొడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. లింగాపూర్ రొడ్డు సంబంధించి విస్తరణ పనులు, మీడియన్, పైప లైన్ పనులు చేయాలని అన్నారు. రొడ్డు విస్తరణ పనులు సంబంధించి విద్యుత్ పోల్స్ తరలింపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి లో నిర్మించిన ఆర్‌డబీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, సంబంధిత వివరాలను ఎంబీ రికార్డులలో నమోదు చేసి బిల్లులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. మానేరు నది పై చేపట్టిన బ్రిడ్జి టెండర్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రోడ్లు నిర్మించే సమయంలో త్రాగు నీటి పైప్ లైన్ పనులకు డ్యామేజి జరుగకుండా చూడాలని అన్నారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. కునారం ఆర్‌ఓబి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూ సేకరణ పూర్తి చేశామని, అక్కడ ఇండ్ల, ఇతర నిర్మాణాల కూల్చివేత పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని స్టేడియం నిర్మాణానికి సంబంధించి అవసరమైన అనుమతులు త్వరగా సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, డీఈలు, ఏఈలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొలనూరు పిహెచ్ లో హెచ్ పి వి వాక్సిన్



ఓదెల/ పెద్దపల్లి మార్చి 28(అక్షరం న్యూస్)
ఓదెల మండలంలోని కొలనూరు ప్రాథమిక వైద్య కేంద్రంలో ప్రధాన వైద్యాధికారి సంజనీష్ కుమార్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలు దాటిన యుక్త వయసు బాలికలకు దాదాపు 22 మంది పిల్లలకు హెచ్ పి వి వాక్సిన్ వేయడం జరిగిందని డాక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ తో పాటు శోభారాణి పి హెచ్ ఎన్ స్టాప్ నర్సులు విజయ హెచ్ ఈ ఓ శ్రీనివాస్ హెల్త్ అసిస్టెంట్ అశోక్ ఏఎన్ఎం. నిర్మల పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్స్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- హాస్టల్ వార్డెన్ లతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్




పెద్దపల్లి, ప్రతినిధి మార్చి-28 అక్షరం న్యూస్;
సంక్షేమ హాస్టల్స్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హాస్టల్ వార్డెన్ లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి సంక్షేమ హాస్టల్స్ వార్డెన్ తప్పనిసరిగా పిల్లలు భోజనం చేసే సమయంలో, సాయంత్రం స్టడీ అవర్స్ లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్స్ లోనే వార్డెన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మార్చి నెలాఖరు లోపు హాస్టల్స్ కు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ముగిసే వరకు స్టడీ అవర్స్ జరగాలని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 23 చివరి తేదీ వరకు మిగిలిన తరగతి పిల్లలకు కూడా స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఏసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, హాస్టల్ వార్డెన్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రులు స్కానింగ్ సెంటర్‌ల ఆకస్మిక తనిఖీ

- నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు
- రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /!మార్చి -28(అక్షరం న్యూస్ )
ముస్తాబాద్ మండల కేంద్రం లోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ సెంటర్లను రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆసుపత్రు లలో రికార్డులను, స్కానింగ్ సెంటర్ల మెషిన్లను పరిశీలించారు . ఫారం ఎఫ్ ఆడిట్లను పరిశీలించి గర్భిణీ స్త్రీ యొక్క వివరాలు సంతకాలు తీసుకొని, గర్భిణీ స్త్రీ స్కానింగ్ వివరాల ఫిలింను జత పరచాలని సూచించారు , నిబంధనలకు విరుద్ధంగా గర్భిణీ స్త్రీ కి ఆడ మగ (లింగ నిర్ధారణ) అని సైగల ద్వారా తెలియజేసిన వారి స్కానింగ్ సెంటర్ లను సీజ్ చేస్తామని, రూ.10,000 వేల రూపాయల జరిమానా విధిస్తూ, మూడు సంవత్సరాలజైలు శిక్ష విధిస్తామని స్కానింగ్ నిర్వాహకులకు సూచించారు , రిజిస్ట్రేషన్ లేని ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహించినట్లయితే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారము చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . వీరితో మహేష్ గౌడ్, నవీన లు పాల్గొన్నారు.



## ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి, మార్చి-28 అక్షరం న్యూస్;
శనివారం లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ధర్మారం మండల తహసిల్దార్ కార్యాలయం, కేజిబీవీ ను కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సకాలంలో జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూ భారతి ఆన్ లైన్ దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కేజీబీవీ లో బాలికలకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి మంచి విద్యా ప్రమాణాలు అందే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. కేజిబీవీ రినోవేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీనివాస్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మన ఇసుక వాహనానికి అధికారిక వెబ్ సైట్ ద్వారా ఇసుక మంజూరు

- తహసీల్దార్ రామచంద్రం



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మార్చి -28(అక్షరం న్యూస్ )
మన ఇసుక వాహనానికి అధికారికవెబ్ సైట్ ద్వారా మాత్రమే ఇసుక కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వ ఉత్తర్వులు మంజూరు అయినవి అని ముస్తాబాద్ తహసిల్దార్ రామచంద్రం ఒక ప్రకటనలో తెలియజేశారు ముస్తాబాద్ మండలంలోని ఇసుక వినియోదారులు మన ఇసుక వాహనం ఆన్ లైన్ పోర్టల్ ద్వారా కొండాపూర్ ఇసుక రిచ్ నుంచి ఇంటి నిర్మాణం, ఇందిరమ్మ ఇళు ్ల,ప్రభుత్వ నిర్మాణాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు,ఇసుక ట్రాక్టర్ ద్వారా బుక్ చేసుకోవడానికి మైనింగ్ శాఖ అనుమతించిందని మండల తహసీల్దార్ రామచంద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఇసుక అవసరమైన వారు ఆన్లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకుని అనుమతి పొందాలని తెలియజేశారు దీని వలన మరింత పారిదర్శకత పెరిగి వినియోదారులకు మేలు జరుగుతుందని తెలియజేశారు.

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?



హైదరాబాద్, మార్చి28 అక్షరం న్యూస్

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థన లు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో

సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

- **అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**
- **తదుపరి క్యూబా అంటూ హెచ్చరిక**

వాషింగ్టన్,మార్చి28 ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.

జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

## అనుకున్న సమయానికన్నా ముందే యుద్ధం ముగింపు

**అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో**

ప్యారిస్,మార్చి 28 ఇరాన్‌పై అనుకున్న సమయం కంటే ముందే దాడులను ముగిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. మరికొన్ని వారాల్లో ఇరాన్ యుద్ధం ముగుస్తుందని తెలిపారు. ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం లేకుండానే తమ లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. తమ దాడులు మరో రెండు, మూడు వారాల్లో పూర్తవుతాయని, అప్పటికి టెహ్రాన్ పూర్తిగా బలహీనపడుతుందని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో జీ-7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రుబియో మాట్లాడారు. 'హోర్ముజ్‌లో జరిగే చమురు రవాణాపై ఇరాన్ సుంకాలు విధించకుండా నిరోధించడమే మా తక్షణ కర్తవ్యం. ఆ సుంకాల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యుద్ధం ముగింపుపై చర్చల కోసం ఇరాన్ పాలకవర్గం మాకు సందేశాలు పంపింది. అయితే మేం ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు' అని రుబియో తెలిపారు. పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలగాల మోహరింపును ఇటీవల భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కూడా రుబియో మాట్లాడారు. 'ఇరాన్‌పై భూతల దాడులు చేయాలని మేం అనుకోవడం లేదు. కానీ, అత్యవసర పరిస్థితులు తలెత్తితే మాత్రం భూతల దాడులకు దిగక తప్పదు. అందుకే అమెరికా దళాలు ఇరాన్ చుట్టూ మోహరిస్తున్నాయి' అని రుబియో స్పష్టం చేశారు.

## మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

**2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు**

లాస్‌ఏంజిల్స్,మార్చి28 ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

**ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక**



హైదరాబాద్,మార్చి28 బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

## విజయవాడలో దారుణం

**ఆటోలో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారం**

విజయవాడ,మార్చి 28 దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. ఎక్కడో ఒకచోట మృగాళ్లు కాచుకునే ఉంటున్నారు. ఏదో ఒక చోట వారిపై కామాంధులు లైంగిక దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. చిన్న, పెద్ద, వృద్ధులు అనే తేడా లేకుండా రెచ్చిపోతున్నారు. ఒంటరిగా చిక్కితే పాపం.. అత్యాచారాలకు తెగపడుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి విజయవాడలో జరిగింది. ఆటో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి వెళ్లాల్సిన ప్రాంతానికి కాకుండా బలవంతంగా కృష్ణలంక వైపునకు తీసుకెళ్లాడు కామాంధుడు. భయభ్రాంతులకు గురి చేసి ఎవరూ లేని ప్రదేశానికి లాక్కెళ్లాడు. అనంతరం యువతిపై అత్యాచారానికి ఒడికట్టాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలిపెట్టి ఆటోతో సహా పరారయ్యాడు. ఏడుస్తూ ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లికి చెప్పింది. షాక్‌కు గురైన బాధిత కుటుంబం మాచవరం పోలీసులను ఆశ్రయించారు. తనపై జరిగిన లైంగిక దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆటో డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

## మరోమారు పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,మార్చి 28 పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ 24 క్యారెట్ల పసిడి ధర 4,492 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఔన్స్ వెండి ధర 69 డాలర్లుగా ఉంది.

# వేసవిలో కిడ్నీల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే.. ఈ సూచనలు పాటించాలి..

గతేడాది కన్నా 2026లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలతో వేసవి ఉండబోతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. సాధారణంగా ఈ సమయంలో ప్రజలు చల్లగా ఉండటం, నీళ్లు ఎక్కువగా తాగడం గురించి మాత్రమే ఆలోచిస్తారు. అయితే శరీరంలో, ముఖ్యంగా కిడ్నీలలో, కనిపించని ఆరోగ్య సంక్షోభం మెల్లగా పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. అంతర్జాతీయ నెఫ్రాలజీ సంఘం గణాంకాల ప్రకారం, 2023లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 788 మిలియన్ మందికి దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ఉన్నట్లు అంచనా. భారత్‌లోనే 138 మిలియన్ మంది దీనితో బాధపడుతున్నారు. వేడి తీవ్రత పెరుగుతున్న కొద్దీ కిడ్నీ ఆరోగ్యం మౌనంగా దెబ్బతింటోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్చి నుంచి మే వరకు దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ రోజులు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో చెమట పట్టడం, దాహం మాత్రమే కాకుండా కిడ్నీలపై పడే ఒత్తిడిని ముందుగానే గుర్తించడం అత్యవసరమని వైద్యులు తెలియజేస్తున్నారు.

### వేడి ఎక్కువగా ఉంటే..

కిడ్నీలు శరీరంలో ద్రవ సమతుల్యతను నియంత్రించడం, వ్యర్థాలను తొలగించడం, రక్తపోటును సమతుల్యం చేయడం వంటి కీలక పనులు చేస్తాయి. కానీ అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ వ్యవస్థలో అంతరాయం కలుగుతుంది. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు శరీరం చల్లబడేందుకు రక్తప్రసరణను చర్మం వైపు మళ్లిస్తుంది. దీని వల్ల కిడ్నీలకు చేరే రక్తప్రవాహం తగ్గిపోతుంది. దీనిని రెనల్ హైపోపర్ఫ్యూషన్ అంటారు. ఇదే సమయంలో డీహైడ్రేషన్ కలిసివస్తే, కిడ్నీలకు ఆక్సిజన్ సరఫరా తగ్గి, విషపదార్థాలను అధికంగా ఫిల్టర్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. పరిశోధనలు సూచిస్తున్నట్లుగా, భారత్‌లో బయట పనిచేసే కార్మికుల్లో తెలియని కారణాలతో వచ్చే



కిడ్నీ వ్యాధి పెరుగుతోంది. దీని ప్రధాన కారణాలు నిరంతర వేడి ఒత్తిడి, తగినంత నీరు తీసుకోకపోవడమే అని నిపుణులు తెలియజేస్తున్నారు.

### వీరికి ప్రమాదం ఎక్కువ..

కొన్ని వర్గాల వారు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. వృద్ధులు దాహం గుర్తించే సామర్థ్యం తగ్గిపోవడం వల్ల ప్రమాదంలో ఉంటారు. రైతులు, కూలీలు, వీధి వ్యాపారులు వంటి బయట పనిచేసేవారు నేరుగా ఎండలో ఉండడం వల్ల ఎక్కువగా ప్రభావితమవుతారు. ఇప్పటికే హైపర్‌టెన్షన్, డయాబెటిస్ లేదా ప్రారంభ దశ కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఈ వేడి మరింత ప్రమాదకరం. వారి కిడ్నీలు అదనపు ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. కిడ్నీ ఒత్తిడికి సంబంధించిన లక్షణాలు చాలా సున్నితంగా ఉంటాయి. ఇవి సాధారణ వేసవి అలసటగా కనిపించవచ్చు. మూత్రం తగ్గిపోవడం, 6-12 గంటల పాటు మూత్ర విసర్జన లేకపోవడం ముఖ్య హెచ్చరిక. మూత్రం గాఢమైన రంగులో (గోధుమ లేదా కోక్ రంగు) కనిపించడం తీవ్రమైన డీహైడ్రేషన్ లేదా మసిల్ బ్రేక్‌డౌన్ సంకేతం కావచ్చు. కాళ్లు లేదా ముఖంలో అకస్మాత్తుగా వాపు రావడం కూడా కిడ్నీలు సరిగా పనిచేయడం లేదనే సూచన. అలాగే మానసిక గందరగోళం, చిరాకు, దిక్కుతోచకపోవడం వంటి లక్షణాలు ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మెదడు, కిడ్నీల పనితీరును ప్రభావితం చేస్తుంది.

### ఈ సూచనలు పాటించాలి..


ఇక వేసవిలో కిడ్నీల సంరక్షణకు చర్యలు తీసుకోవడం చాలా అవసరం. వేసవిలో కిడ్నీ రక్షణ కోసం కేవలం నీళు తాగడం సరిపోదు. సరైన హైడ్రేషన్ వ్యూహం అవసరం. దాహం వేసే వరకు వేచి ఉండకుండా తరచూ ద్రవాలు తీసుకోవాలి. ఉప్పు మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి పానీయాలు శరీరంలో కోల్పోయిన లవణాలను భర్తీ చేస్తాయి. బయట పనిచేసేవారు ప్రతి 20 నిమిషాలకు ఒక గ్లాస్ నీరు తాగడం మంచిది. వేసవిలో ఎక్కువ నీరు కలిగిన పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. పుచ్చకాయ, తర్బూజా, ద్రాక్ష వంటి పండ్లు, దోసకాయ, సొరకాయ వంటి కూరగాయలు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. అత్యధిక ప్రోటీన్ ఆహారాన్ని ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో తగ్గించడం మంచిది. ఎందుకంటే ప్రోటీన్ మెటబాలిజం వల్ల నీటి అవసరం పెరిగి కిడ్నీలపై ఒత్తిడి పెరుగుతుంది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య ఎండలో బయటకు వెళ్లడం నివారించాలి. టీ, కాఫీ, మద్యం వంటి పానీయాలు ద్రవ నష్టం పెంచుతాయి కాబట్టి పరిమితంగా తీసుకోవాలి. శరీరం వేడెక్కినప్పుడు కాళ్లను చల్లని నీటిలో ఉంచడం వంటి చిన్న మార్పులు కూడా శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడతాయి. వాతావరణ మార్పులతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు కూడా మారాలి. 45 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతల సమయంలో కిడ్నీలు సులభంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఈ వేసవిలో కిడ్నీ సంరక్షణను తప్పనిసరిగా తీసుకోవాల్సిన చర్యగా భావించాలి. మూత్రాన్ని గమనించడం, నీడలో ఉండడం, సరైన హైడ్రేషన్ పాటించడం ద్వారా కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# మహిళల్లో పెరుగుతున్న గుడ్ గర్ల్ సిండ్రోమ్ సమస్య.. ఏంటిది.. దీని వల్ల ఏం జరుగుతుంది..?

గుడ్ గర్ల్ సిండ్రోమ్ అనేది అధికారిక వైద్య నిర్ధారణ కాకపోయినా, సమాజం విధించిన అంచనాల ప్రభావంతో ఏర్పడే ప్రవర్తనా నమూనాగా నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో మహిళలు పరిపూర్ణంగా కనిపించడానికి, ఇతరుల అభిమానం పొందడానికి తమ వ్యక్తిగత అవసరాలను అణచివేస్తుంటారు. దీని వల్ల పీపుల్ ప్లీజింగ్, గొడవల పట్ల భయం, స్వీయ హద్దులను నిర్ధారించలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాగే ఈ సిండ్రోమ్ వల్ల మహిళలలో హార్మోన్ అసమతుల్యతలు పెరుగుతున్నాయని, బయటకు ఒత్తిడి కనిపించకుండా ఎప్పుడూ అంచనాలకు తగ్గట్టు ఉండాలనే ప్రయత్నం శరీరంలో నిరంతర ఒత్తిడిని కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా భావోద్వేగాలను ఎక్కువ కాలం అణచివేయడం వల్ల శరీరం ఎప్పుడూ స్ట్రెస్ మోడ్ లోనే ఉండిపోతుంది. న్యూరోసైన్స్ అండ్ బయో బిహేవియరల్ రివ్యూస్ వంటి పరిశోధనలు భావోద్వేగ ఒత్తిడి కారణంగా హార్మోన్లలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని సూచిస్తున్నాయి.

### కార్టిసాల్ స్థాయిలు నిరంతరంగా అధికమే..

మాలిక్యులర్ సైకియాట్రీ పరిశోధన ప్రకారం, నిరంతరం ఇతరుల ఆమోదం కోసం ప్రయత్నించడం, వైఫల్య భయం ఉండటం వంటివి మెదడులో థ్రెట్ సిగ్నల్‌ను కలిగిస్తాయి. దీంతో హైపోథాలమస్-పిట్యూటరీ-అడ్రినల్ యాక్సిస్ సక్రియమై హార్మోన్ సమతుల్యత దెబ్బతింటుంది. ఈ ప్రక్రియలో ముఖ్యంగా కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ అధికంగా ఉత్పత్తి అవుతుంది. సాధారణంగా ఇది తాత్కాలికంగా పెరిగి తగ్గిపోవాలి. కానీ పరిపూర్ణత కోసం ఎప్పుడూ ఒత్తిడిలో ఉండే మహిళలలో ఇది నిరంతరం ఎక్కువగా ఉంటుంది. 2025లో లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ



జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, అధిక కార్టిసాల్ వల్ల ప్రొజెస్టిరోన్ తగ్గిపోవడం జరుగుతుంది. దీనివల్ల మెన్స్ట్రువల్ సమస్యలు, మొటిమల వంటి సమస్యలు వస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే, ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరగడం ద్వారా పోలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. అధిక కార్టిసాల్ కారణంగా రక్తంలో గ్లూకోజ్ పెరిగి, దాన్ని నియంత్రించేందుకు శరీరం ఎక్కువ ఇన్సులిన్ విడుదల చేస్తుంది. దీని ఫలితంగా పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం, అండోత్పత్తి లోపాలు వస్తాయి.

### అనేక అనారోగ్య సమస్యలు..

ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నప్పటికీ, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు, ఆసియా కుటుంబాల్లో దీన్ని ఎక్కువగా గమనిస్తున్నామని పరిశోధనలు తెలుపుతున్నాయి. పాత విలువలను కొనసాగించే తల్లిదండ్రుల ఒత్తిడి కూడా ఈ పరిస్థితికి కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుడ్ గర్ల్ సిండ్రోమ్ వల్ల శరీరంలో అనేక హెచ్చరిక సంకేతాలు కనిపిస్తాయి. నెలసరిలో మార్పులు, అండోత్పత్తి ఆగిపోవడం (అమెనోరియా), నిద్రలేమి, నిరంతర అలసట వంటి సమస్యలు వస్తాయి. అలాగే ఆందోళన, మూడ్ స్వింగ్స్, మెదడు మబ్బుగా ఉండటం వంటి న్యూరోలాజికల్ లక్షణాలు కూడా కనిపిస్తాయి. మెటాబాలిక్ మార్పుల కారణంగా కఠినమైన డైట్ పాటించినా బరువు తగ్గకపోవడం, థైరాయిడ్ పనితీరు మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ భావోద్వేగ ఒత్తిడి, హార్మోన్ అసమతుల్యతల సంకేతాలుగా భావించాలి.

### ఈ సూచనలు పాటించాలి..

ఇక పరిస్థితిని ఎదుర్కోవడానికి నిపుణులు సూచనలు కూడా చేస్తున్నారు. థైరాయిడ్, ఇన్సులిన్, ప్రొక్రియేటివ్ హార్మోన్ల (ాఎ, ఖీాఎ, ప్రోలాక్టిన్) కోసం క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. ాజూూ లేదా థైరాయిడ్ సమస్యలు ఉంటే వెంటనే చికిత్స తీసుకోవడం ప్రారంభించాలని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను నియంత్రించవచ్చని వారు చెబుతున్నారు. వీటితో పాటు జీవనశైలి మార్పులు కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర హార్మోన్ సమతుల్యతను పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే యోగా, వ్యాయామం ద్వారా శరీరంలోని ఫైట్ ఆర్ ఫ్లైట్ ప్రతిస్పందన తగ్గుతుంది. అదేవిధంగా భావోద్వేగాలను అణచివేయకుండా జర్నలింగ్ లేదా థెరపీ ద్వారా విడుదల చేయడం కూడా అవసరం. ఈ విధంగా ఒత్తిడిని తగ్గించడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. పరిపూర్ణత కోసం పరుగులు తీయడం కన్నా శారీరక-మానసిక సమతుల్యతను కాపాడుకోవడం ముఖ్యం. ఇతరుల ఆమోదం కంటే స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మహిళలు నిజమైన ఆరోగ్యాన్ని సాధించగలరని నిపుణులు సూచిస్తున్నారు.

## తరచూ తలనొప్పి రావడానికి కారణాలు ఏంటి?

తలనొప్పి సాధారణ సమస్యే. చాలా మంది దీనిని వదిలించుకోవడానికి వివిధ పరిష్కార పద్ధతులను ప్రయత్నిస్తారు. అయితే పదే పదే తలనొప్పి వస్తుంటే మాత్రం.. దానికి కొన్ని కారణాలు ఉండొచ్చు. ఇవి ఎక్కువగా మన జీవనశైలి, ఆహార అలవాట్లు, నిద్ర విధానానికి సంబంధించినవే అని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..




### తలనొప్పికి ప్రధాన కారణాలు..

డీహైడ్రేషన్: రోజంతా తగినంత నీరు తాగకపోతే తలనొప్పి రావచ్చు. స్పష్టమైన కారణం లేకుండా నొప్పి వస్తుంటే ముందుగా నీటి పరిమాణం పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు.

క్రమం తప్పిన ఆహార అలవాట్లు: సమయానికి భోజనం చేయకపోవడం లేదా భోజనం మానేయడం వల్ల తలనొప్పి రావచ్చు. కొందరికి ఎక్కువగా తీపి పదార్థాలు లేదా కార్బొహైడ్రేట్లు తీసుకున్న తర్వాత కూడా తలనొప్పి వస్తుంది. అలా ఉంటే ఆ ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది.

నిద్ర లోపం: సరైన నిద్ర లేకపోవడం కూడా తలనొప్పికి ముఖ్య కారణం. ఆలస్యంగా నిద్రపోవడం, నిద్రకు ముందు భారమైన ఆహారం తినడం, సరైన భంగిమలో పడుకోకపోవడం వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరిగి తలనొప్పి వస్తుంది.

ఆరోగ్య సంబంధిత సమస్యలు: వాయు కాలుష్యం వల్ల వచ్చే జలుబు, అలెర్జీలు, శ్వాస సమస్యలు కూడా తలనొప్పికి కారణం కావొచ్చు. అలాగే అధిక ఒత్తిడి, ఆందోళన వల్ల వచ్చే హార్మోన్ మార్పులు కూడా తలనొప్పిని పెంచుతాయి.

### తలనొప్పి ఇలా తగ్గించుకోండి..

తలనొప్పి వచ్చినప్పుడు ఎక్కువగా నీరు తాగాలి. నుదురు, తల, చెవుల వెనుక భాగాన్ని మృదువుగా మసాజ్ చేయాలి. లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం మంచిది. కూర్చునేటప్పుడు వీపు నిటారుగా ఉంచాలి, పాదాలు నేలపై సరిగా పెట్టాలి. నిద్రకు ముందు మద్యం, పొగతాగడం మానేయాలి. తరచూ లేదా తీవ్రమైన తలనొప్పి ఉంటే తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలి.

## ఒంట్లో వేడి పెరిగి చాలా ఇబ్బందిగా ఉందా.. ఈ టిప్స్ మీ కోసమే..!



ఎండాకాలం వచ్చిందంటే చాలు ఎండలు మండిపోతాయి. ఈ ఎండలవల్ల నిత్యం శరీర ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. శరీరం డీహైడ్రేట్ అవుతుంది. దాంతో తరచూ ఒళ్లు అలసిపోయి నీరసం ఆవహిస్తుంది. ఏం చేయాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. శరీరం సహకరించదు. అలాంటి పరిస్థితి రావద్దంటే శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా కాపాడుకోవాలి. శరీర ఉష్ణోగ్రతలు పెరుగకుండా చూసుకోవాలి. అందుకోసం కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. మరి ఆ చిట్కాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

1. రోజూ రెండు కప్పుల తాటి బెల్లం కలిపిన నీళ్లను తాగడం ద్వారా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.
2. ప్రతి రోజూ క్రమం తప్పకుండా నిమ్మ రసం, కొబ్బరి నీళ్లు తాగడం ద్వారా కూడా శరీరంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చల్లబడుతుంది.
3. అదేవిధంగా రోజూ ఉదయం కొబ్బరి నూనె లేదా పొద్దు తిరుగుడు నూనెతో శరీరానికి మర్ధన చేసుకుని స్నానం చేయడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.
4. క్రమం తప్పకుండా ఎర్ర మందారం టీ తాగడంవల్ల కూడా శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.
5. కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగడం ద్వారా కూడా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.
6. అంతేగాక మెంతులను వేయించి, పొడిచేసి రోజూ గోరు వెచ్చటి నీటితో కలిపి తాగడం ద్వారా కూడా ఒంట్లో వేడిని తగ్గించుకోవచ్చు.
7. సోంపు, జీలకర్ర, ధనియాలు రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు తాగడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.
8. దానిమ్మ గింజల్లో కూడా శరీరంలోని వేడిని తగ్గించే లక్షణం ఉంది. రెండు మూడు రోజులకు ఒకసారైనా దానిమ్మ గింజలు తినడం లేదా దానిమ్మ రసం తాగడంవల్ల శరీరం చల్లగా ఉంటుంది.
9. అదేవిధంగా వేడిచేసే ఆహార పదార్థాలైన పుల్లటి పండ్లు, బీట్‌రూట్‌లు, క్యారెట్‌లను వేసవిలో ఎక్కువగా తినకుండా ఉండటం ద్వారా కూడా శరీర ఉష్ణోగ్రతలను అదుపులో పెట్టుకోవచ్చు.

## దేశంలో ఏటా పెరిగిపోతున్న కిడ్నీ వ్యాధులు..

- **30 ఏళ్ల నుంచే పరీక్షలు తప్పనిసరి అంటున్న నిపుణులు..**



మూత్రపిండాల ఆరోగ్యం సాధారణంగా తీవ్ర లక్షణాలు కనిపించే వరకు నిర్లక్ష్యానికి గురవుతుంటుంది. అయితే ప్రస్తుతం దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిభారత్‌లో ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. ఇతర వ్యాధులతో పోలిస్తే కిడ్నీ సమస్యలు చాలా కాలం వరకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా మెల్లగా అభివృద్ధి చెందుతాయి. లక్షణాలు బయటపడే సమయానికి కిడ్నీలకు గణనీయమైన నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అందుకే 30 ఏళ్ల వయస్సు నుంచే కిడ్నీ ఆరోగ్య పరీక్షలు ప్రారంభించడం అత్యంత కీలకమని వైద్యులు చెబుతున్నారు. భారత్‌లో కిడ్నీ వ్యాధుల భారం వేగంగా పెరుగుతోంది. తాజా పరిశోధనల ప్రకారం 2011-2017 మధ్య కాలంలో సుమారు 11 శాతం ఉన్న జఖణ ప్రబలత 2018-2023 మధ్య కాలంలో 16 శాతానికి పైగా పెరిగింది. ఇది పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో సూచిస్తోంది. ఈ పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయి. వేగవంతమైన పట్టణీకరణ, కూర్చునే జీవనశైలి, అసమతుల ఆహారం, పెరుగుతున్న స్థూలకాయం కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తున్నాయి. అదనంగా, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ కేసులు భారత్‌లో అధికంగా ఉండటం కూడా కిడ్నీ నష్టానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

### ముందే పరీక్షలు చేయించడం మంచిది..

కిడ్నీ వ్యాధులలో అత్యంత ప్రమాదకర అంశం ఏంటంటే, ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. చాలా మంది తమ కిడ్నీ పనితీరు క్రమంగా తగ్గిపోతున్నదని తెలియకుండా సాధారణ జీవితం కొనసాగిస్తుంటారు. అందువల్ల ముందస్తు గుర్తింపు అత్యంత అవసరం. గతంలో కిడ్నీ వ్యాధులను వృద్ధులకు మాత్రమే సంబంధించిన సమస్యగా భావించేవారు. అయితే ప్రస్తుతం ఈ ధోరణి మారుతోంది. 30లు, 40ల్లో ఉన్నవారిలో కూడా కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయి. ఇది ముందస్తుగా వచ్చే డయాబెటిస్, రక్తపోటు, స్థూలకాయం వంటి సమస్యలతో సంబంధం కలిగి ఉంది. ఈ వ్యాధులు నియంత్రణలో లేకపోతే కిడ్నీలలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతింటాయి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలను, అదనపు ద్రవాన్ని తొలగించే కిడ్నీల సామర్థ్యం తగ్గిపోతుంది. 30 ఏళ్ల వయస్సు తర్వాత స్క్రీనింగ్ ప్రారంభించడం ద్వారా లక్షణాలు కనిపించకముందే కిడ్నీ సమస్యలను గుర్తించవచ్చు. సీరమ్ క్రియాటినిన్, ఈజీఎఫ్ఆర్ యూరిన్ ఆల్బ్యుమిన్ వంటి పరీక్షలు ప్రారంభ దశలోనే అసాధారణతలను గుర్తించడంలో సహాయపడతాయి. ముందుగానే గుర్తిస్తే జీవనశైలి మార్పులు, మందులతో వ్యాధిని నియంత్రించవచ్చు.

### కిడ్నీ వ్యాధులకు కారణాలు ఇవే..

కిడ్నీ వ్యాధులకు అనేక ప్రమాద కారకాలు ఉన్నాయి. ముఖ్యంగా డయాబెటిస్, హైపర్‌టెన్షన్ ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. భారత్‌లో జఖణ కేసుల్లో పెద్ద భాగం ఈ రెండు కారణాల వల్లనే వస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవి కాకుండా స్థూలకాయం, అధిక ఉప్పు వినియోగం, పొగ త్రాగడం, ఎక్కువగా పెయిన్‌కిల్లర్స్ వాడటం, కుటుంబంలో కిడ్నీ వ్యాధుల చరిత్ర ఉండటం వంటి అంశాలు కూడా ప్రమాదాన్ని పెంచుతాయి. కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు, వ్యవసాయ కార్మికుల్లో నీటి కొరత వంటి పర్యావరణ కారణాలు కూడా ప్రభావం చూపుతాయి. జఖణ ప్రధాన సవాలు దాని నిశ్శబ్ద ప్రగతి. ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు ఉండవు. కాళ్ల వాపు, అలసట, మూత్రంలో మార్పులు, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపించే సమయానికి కిడ్నీల పనితీరు గణనీయంగా తగ్గిపోయి ఉంటుంది. అయితే ముందస్తు గుర్తింపు ద్వారా పరిస్థితిని పూర్తిగా మార్చుకోవచ్చు. సమయానికి చికిత్స తీసుకుంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం ద్వారా వ్యాధి ప్రగతిని నెమ్మదింప చేయవచ్చు.

# శరీరంలో జరిగే ఈ ఒక్క మార్పే అనేక వ్యాధులకు కారణం అవుతుంది.. అదేమిటంటే..?



మధుమేహం, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు రావడానికి గల కారణాల్లో ఒకటి అధిక బరువు అన్న సంగతి అందరికీ తెలిసిందే. చాలా మందికి బరువు తగ్గితే ఈ సమస్యలు తగ్గుతాయి అనే భావన ఉంది. నిజానికి ఆరోగ్యకరమైన బరువును నిలుపుకోవడం ఉపయోగకరమే. అయితే ఆధునిక పరిశోధనలు ఈ సమస్యల వెనుక మరో కీలక కారణం దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ (వాపు) ఉందని చెబుతున్నాయి. ఈ మెటాబాలిక్ ఇన్‌ఫ్లమేషన్ చాలా నిశ్శబ్దంగా, తక్కువ స్థాయిలో కొనసాగుతూ ఉంటుంది. ఇది మనకు ప్రత్యక్షంగా అనిపించకపోయినా, శరీరం చక్కెరను ఎలా ప్రాసెస్ చేస్తుంది, కొవ్వును ఎలా నిల్వ చేస్తుంది, రక్తనాళాలను ఎలా రక్షిస్తుంది అనే ప్రక్రియలపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం అనేక వైద్య సంస్థలు, మార్గదర్శకాలు కూడా ఇన్‌ఫ్లమేషన్‌ను మెటబాలిక్ వ్యాధులకు ప్రధాన కారణంగా గుర్తిస్తున్నాయి.

### కీలకంగా మారే ఇన్‌ఫ్లమేషన్..

మధుమేహం, ఫ్యాటీ లివర్, గుండె వ్యాధులు పరస్పరం బలమైన సంబంధం కలిగినవే. ఇవి తరచూ కలిసి అభివృద్ధి చెందుతాయి, ఎందుకంటే వీటి మెటబాలిక్ మార్గాలు ఒకే విధంగా ఉంటాయి. ఇందులో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి అవసరమైనదానికంటే ఎక్కువగా శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, చక్కెరలు, అధిక కేలరీలు తీసుకుంటే, లివర్ ఆ అదనపు శక్తిని కొవ్వుగా మారుస్తుంది. కాలక్రమేణా ఈ కొవ్వు లివర్ కణాల్లో పేరుకుపోయి ఫ్యాటీ లివర్‌కు దారితీస్తుంది. ఫ్యాటీ లివర్ కేవలం కొవ్వును నిల్వ చేయడమే కాకుండా, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే రసాయన సంకేతాలను విడుదల చేస్తుంది. ఇవి ఇన్సులిన్ పనితీరును దెబ్బతీసి, రక్తంలో చక్కెర నియంత్రణలను కష్టతరం చేస్తాయి. దీంతో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరిగి, ప్యాంక్రియాస్‌పై ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో రక్తనాళాల గోడలను కూడా ఈ ఇన్‌ఫ్లమేషన్ ప్రభావితం చేసి, గుండె వ్యాధులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### ఆహారం, జీవనశైలి ముఖ్యం..

ఆహారం, జీవనశైలి ఇన్‌ఫ్లమేషన్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెరలు, మైదాతో చేసిన పదార్థాలు, తీపి పానీయాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తరచూ పెరిగిపోతాయి. ఇది లివర్‌లో కొవ్వు నిల్వను పెంచి, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను మరింత తీవ్రతరం చేస్తుంది. దీనికి విరుద్ధంగా కూరగాయలు, పప్పులు, గింజలు, విత్తనాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఇవి ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అందించి గట్ హెల్త్ (జీర్ణాశయ ఆరోగ్యం)ను మెరుగుపరుస్తాయి. అందుకే ప్రస్తుతం పోషకాహార సూచనలు కేవలం కేలరీలపై కాకుండా ఆహారం నాణ్యతపై దృష్టి పెడుతున్నాయి. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే మెటాబాలిక్ వ్యాధులు కేవలం అధిక బరువు ఉన్నవారిలోనే కాదు. ముఖ్యంగా దక్షిణాసియా ప్రజల్లో సాధారణ బరువుతో ఉన్నవారికీ ఫ్యాటీ లివర్, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్యలు కనిపిస్తున్నాయి. అంటే మెటబాలిక్ ఆరోగ్యం కేవలం బరువుతో నిర్ణయించబడదు.

### ఈ సూచనలు పాటించాలి..

ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడానికి చిన్న చిన్న మార్పులు చాలా ఉపయోగపడతాయి. రోజువారీ జీవితంలో సులభంగా పాటించగల అలవాట్లు దీర్ఘకాల ప్రయోజనాలు ఇస్తాయి. మంచి ప్రోటీన్ తీసుకోవడం, పప్పులు, బీన్స్, సోయా, గుడ్లు, పాలు, గింజలు వంటి ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. మైదా, తీపి పదార్థాలను తగ్గించడం గ్లూకోజ్ స్పైక్స్‌ను తగ్గిస్తుంది. ప్రతి భోజనంలో ఫైబర్ కలిగిన ఆహారాలైన కూరగాయలు, పండ్లు, ధాన్యాలు తీసుకోవడం గట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలాగే విత్తనాలు, నట్‌లు, ఆలివ్ ఆయిల్, చేపలలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. రోజూ శారీరకంగా చురుకుగా ఉండటం, నడక వంటి వ్యాయామాలు చేయడం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి. సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ కూడా ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కేవలం బరువు తగ్గడంపైనే దృష్టి పెట్టడం సరిపోదు. మెటాబాలిక్ ఆరోగ్యం కోసం జీవనశైలిని సమతుల్యం చేయడం అత్యంత ముఖ్యం. తక్కువ తినడం లేదా బరువు తగ్గడం మాత్రమే కాదు, శరీరం సక్రమంగా పనిచేయడానికి, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడానికి అవసరమైన అలవాట్లను అలవరుచుకోవడమే నిజమైన ఆరోగ్యానికి మార్గమని వైద్యులు చెబుతున్నారు.

# మహిళలు రోజూ స్ట్రెంగ్త్ ట్రెయినింగ్ వ్యాయామాలను చేయాల్సిందే.. ఎందుకంటే..?



శరీర బలం, సహనం, కండరాల పెరుగుదల కోసం చేసే వ్యాయామ విధానమే స్ట్రెంగ్త్ ట్రైనింగ్. బరువులు, రెసిస్టెన్స్ బ్యాండ్లు లేదా ఇతర సాధనాల సహాయంతో కండరాలపై ఒత్తిడి పెంచడం ద్వారా ఈ వ్యాయామం చేస్తారు. అయితే స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేయాలంటే తప్పనిసరిగా జిమ్‌కే వెళ్లాలా అనే సందేహం చాలామందిలో ఉంది. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేయడానికి తప్పనిసరిగా జిమ్ కు వెళ్లాల్సిన అవసరం లేదని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వల్ల శరీరానికి కలిగే లాభాలను కూడా వైద్యులు వివరిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా మహిళలకు సన్నగా కనిపించాలి, తక్కువ బరువు ఉండాలి అని అందరూ చెబుతూ ఉంటారు. కానీ అది నిజమైన ఆరోగ్య సూచిక కాదని, కండరాలను పెంచుకోవడం మహిళలకు అత్యంత ముఖ్యమైన ఆరోగ్య మెరుగుదలల్లో ఒకటి అని వైద్యులు తెలియజేస్తున్నారు.

### షుగర్ తగ్గేందుకు, ఎముకల దృఢత్వానికి..

స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేయడం వల్ల కండరాలు మెటబాలిజాన్ని పెంచి శరీరంలో శక్తి వినియోగాన్ని సమర్థవంతంగా చేస్తాయి. అలాగే ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అదేవిధంగా, వయసు పెరిగే కొద్దీ మహిళల్లో తగ్గే ఎముకల దృఢత్వాన్ని కండరాలు రక్షిస్తాయి. హార్మోన్ల సమతుల్యతను కూడా మెరుగుపరచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో పాటు జాయింట్ల ఆరోగ్యం మెరుగుపడి గాయాల ప్రమాదం తగ్గుతుందని వైద్యులు వివరిస్తున్నారు. వెయిట్స్ ఎత్తడం కేవలం బాహ్యంగా బలంగా కనిపించడానికి కాదు. శరీరాన్ని మెటబాలిక్‌గా చురుకుగా, హార్మోనల్‌గా సమతుల్యంగా, శారీరకంగా బలంగా తయారు చేయడానికే ఇది అవసరమవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

### అంతర్గతంగా బలం కూడా అవసరం..

మహిళలు ఇంటి పనులు చేస్తారు, బాధ్యతలు మోస్తారు, అందరి మూడ్‌ను లిఫ్ట్ చేస్తారు. ఇక వారు బరువులు కూడా ఎత్తాల్సిన సమయం వచ్చిందని, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ అనేది జిమ్‌కే పరిమితం కాదు అని వైద్యులు తెలియజేస్తున్నారు. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ మెటబాలిజాన్ని పెంచడం, హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడం, ఎముకలను బలపరచడం, శరీర ధారణ (పోశ్చర్)ను సరిచేయడం, అలాగే ఆత్మవిశ్వాసాన్ని పెంచడం వంటి ప్రయోజనాలు కలిగి ఉంటాయని పేర్కొన్నారు. బలమైన మహిళలు ప్రపంచాన్ని కేవలం మోసే వారు కాదు, దాని స్వరూపాన్ని మార్చగలరు. బయట మాత్రమే కాదు, లోపల కూడా బలంగా మారడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

## వేసవి కాలంలో జీలకర్ర నీరు తాగితే ఎన్నో ప్రయోజనాలు.. తెలిస్తే అస్సలు వదలరు!



సాధారణంగా మనం వంటల్లో రుచి కోసం జీలకర్రను వాడుతుంటాం. అయితే.. జీలకర్ర సుగంధ ద్రవ్యం మాత్రమే కాదు, ఇందులో లెక్కలేనన్ని దివ్యౌషధాలు దాగి ఉన్నాయని ఆయుర్వేదం చెబుతోంది. జీలకర్ర వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఎండాకాలంలో రోజూ ఉదయం జీలక్రర నీటిని తాగడం వల్ల శరీరానికి కలిగే ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదలరు. ఒక గ్లాసు నీటిలో ఒక స్పూన్ జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని మరిగించి, వడపోసి గోరు వెచ్చగా చేసుకుని తాగాలి. ఇలా నెలరోజుల పాటు క్రమం తప్పకుండా తాగితే అద్భుతమైన మార్పులు గమనించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

శరీరాన్ని చల్లబరుస్తుంది: ఎండాకాలంలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, శరీరాన్ని లోపలి నుంచి చల్లగా ఉంచేందుకు జీలకర్ర నీరు సాయపడుతుంది.

బరువు తగ్గడంలో కీలకం: జీలకర్ర మెటబాలిజం(జీవక్రియ) రేటును పెంచుతుంది. ఇది శరీరంలోని అనవసరపు కొవ్వును కరిగించి, బరువు తగ్గాలనుకునే వారికి ఒక సహజ సిద్ధమైన పరిష్కారంగా పనిచేస్తుంది.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది: గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి ఇది తోడ్పడుతుంది.

రోగ నిరోధక శక్తి: ఇందులో ఉండే ఐరన్, యాంటీఆక్సిడెంట్లు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల బారినపడకుండా కాపాడతాయి.

చర్మ సౌందర్యం: జీలకర్ర నీటిలో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేయడం వల్ల ముఖంపై మొటిమలు తగ్గి, చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.

డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం: ఎండల వల్ల శరీరం త్వరగా అలసిపోతుంది, నీటి శాతం తగ్గిపోతుంది. జీలకర్ర నీటిలో ఉండే పొటాషియం, మెగ్నీషియం శరీరంలోని ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడతాయి. రోజంతా ఉత్సాహంగా ఉండేలా తోడ్పడతాయి.



డయాబెటిస్ నియంత్రణకు మేలు: క్రమం తప్పకుండా జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రేరేపించి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది.

నిద్రలేమి సమస్యకు చెక్: వేసవి రాత్రుల్లో ఉక్కపోత వల్ల సరిగ్గా నిద్రపట్టని వారికి జీలకర్ర నీరు చక్కగా పనిచేస్తుంది. ఇది మనసును ప్రశాంతంగా ఉంచడంతో పాటు గాఢ నిద్రపట్టేలా చేస్తుంది.

## జుట్టు రాలే సమస్య ఉన్నవారు ఎలాంటి వైద్య పరీక్షలను చేయించుకోవాలి..?



జుట్టు రాలడం సాధారణంగా సౌందర్య సాధనాలను ఎక్కువగా వాడడం వల్ల జరుగుతుందని చాలా మంది భావించినప్పటికీ, వైద్య నిపుణుల ప్రకారం ఇది శరీరంలో ఉన్న పోషక లోపాలు, హార్మోన్ అసమతుల్యతలు లేదా ఆటోఇమ్యూన్ వ్యాధుల సంకేతంగా ఉండొచ్చు. జుట్టు పలుచబడటం లేదా తరచుగా రాలిపోవడం వంటి సమస్యలు ఉన్నప్పుడు, కొన్ని రక్తపరీక్షలు అసలు కారణాన్ని గుర్తించడంలో సహాయపడతాయని చర్మ వైద్యులు చెబుతున్నారు. జుట్టు రాలే సమస్యతో బాధపడే వారు కొన్ని ముఖ్యమైన ల్యాబ్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈ పరీక్షలు పోషక స్థితి, హార్మోన్ల సమతుల్యత, అలాగే ఇతర అంతర్గత ఆరోగ్య సమస్యలపై కీలక సమాచారం అందిస్తాయి. జుట్టురాలే సమస్యతో బాధపడే వారు చేయించుకోవాల్సిన ముఖ్యమైన పరీక్షల గురించి వైద్యుల మాటల్లో ఇప్పుడు తెలుసుకుందాం.

### సీరమ్ ఫెరిటిన్, విటమిన్ బి12 టెస్టులు..

ఈ పరీక్షల్లో ముఖ్యంగా సీరమ్ ఫెరిటిన్ స్థాయిలను పరిశీలిస్తారు. ఇది శరీరంలో ఐరన్ నిల్వలను తెలియజేస్తుంది. భారతీయుల్లో దీర్ఘకాలంగా జుట్టు రాలడానికి తక్కువ ఫెరిటిన్ ఒక ప్రధాన కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. ఐరన్ లోపం వల్ల జుట్టు పెరుగుదల చక్రంలో అంతరాయం ఏర్పడి, హెయిర్ ఫాలికల్స్ ముందుగానే షెడింగ్ దశలోకి వెళ్లే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అలాగే విటమిన్ బి12 పరీక్ష కూడా అత్యంత ముఖ్యమైనది. ఈ విటమిన్ తక్కువగా ఉంటే తల మొత్తం మీద జుట్టు పలుచబడటం కనిపించవచ్చు. అలాగే చర్మంపై రంగు మార్పులు, తక్కువ వయస్సులోనే జుట్టు తెల్లబడటం వంటి సమస్యలు కూడా కలుగుతాయి. ఇక హార్మోన్ అసమతుల్యతను గుర్తించడానికి ఙంఎజూూా స్థాయిలను కూడా కొన్నిసార్లు పరీక్షిస్తారు. ఈ హార్మోన్ స్థాయి ఎక్కువగా ఉంటే మహిళల శరీరంలో పురుష హార్మోన్లు పెరిగినట్లుగా భావిస్తారు. ఇది మొటిమలు పెరగడానికి, జుట్టు పలుచబడడానికి దారితీస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

### ఏఎన్ఏ, సీరమ్ కార్టిసాల్ టెస్టులు..

అలాగే జుట్టు రాలడానికి స్పష్టమైన కారణం కనిపించనప్పుడు, ూచీూా (అంటీ-న్యూక్లియర్ యాంటీబాడీ) పరీక్షను సూచిస్తారు. ఈ పరీక్ష ద్వారా ఆటోఇమ్యూన్ వ్యాధులను గుర్తించవచ్చు. ఈ రకాల వ్యాధుల్లో శరీర రోగనిరోధక వ్యవస్థ తానే తన కణజాలాలపై దాడి చేస్తుంది. దీనివల్ల జుట్టు రాలడం, చర్మంపై రంగు మార్పులు వంటి సమస్యలు ఏర్పడవచ్చు. అదే విధంగా, ఒత్తిడి ప్రభావాన్ని అంచనా వేయడానికి సీరమ్ కార్టిసాల్ పరీక్షను కూడా ఉపయోగిస్తారు. స్ట్రెస్ కారణంగా కార్టిసాల్ హార్మోన్ అధికంగా విడుదలవుతుంది. ఇది ఎక్కువకాలం అధిక స్థాయిలో ఉంటే మొటిమలు పెరగడం, జుట్టు పలుచబడటం వంటి సమస్యలు తీవ్రం కావచ్చు.

### సీరమ్ అల్బుమిన్ టెస్టు..

వీటితో పాటు పోషకాహార లోపం కూడా జుట్టు రాలడంలో కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే సీరమ్ అల్బుమిన్ పరీక్ష ద్వారా శరీరంలోని మొత్తం ప్రోటీన్ స్థాయిని పరిశీలిస్తారు. ప్రోటీన్ తక్కువగా తీసుకోవడం లేదా శరీరం సరిగా గ్రహించకపోవడం వల్ల గోర్లు బలహీనపడటం, జుట్టు పలుచబడటం జరుగుతుంది. ఈ పరీక్షలు చేయడం ద్వారా జుట్టు రాలడానికి గల ప్రధాన కారణాన్ని తెలుసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రతి రోగికి ఒకే విధమైన పరీక్షలు అవసరం ఉండవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. దీర్ఘకాలంగా జుట్టు రాలే సమస్య ఉన్నవారు తప్పనిసరిగా నిపుణుడైన చర్మ వైద్యుడిని సంప్రదించి, తమ లక్షణాల ఆధారంగా అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## వేసవిలో మజ్జిగను ఇలా చేసుకు తాగితే..



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయి. సూర్యుడు సైతం తెల్లవారగానే ఆకాశంలో భగభగ మంటూ ప్రత్యక్షమైపోతాడు. ఎండలు మండిపోతాయి. దీంతో శరీరం త్వరగా నిర్జలీకరణకు గురవుతుంది. చెమట రూపంలో శరీరం నుంచి నీరు, అవసరమైన లవణాలు కోల్పోడం వల్ల తీవ్రమైన అలసటతోపాటు నీరసం కలుగుతాయి. అలాంటి వేళ.. మన శరీరాన్ని చల్లగా, తాజాగా ఉండడానికి ఏదైనా చల్లని పానీయం తాగాలనిపిస్తుంది. దాహాన్ని తీర్చుకోవడానికి చాలా మంది శీతల పానీయాలు, సోడాలు, కృత్రిమ పళ్ల రసాలు తాగుతారు. వాటిలో చక్కెర, రసాయనాలు అధికంగా ఉంటాయి. దీంతో అవి ఆరోగ్యానికి కంటే కీడే ఎక్కువగా చేస్తాయి. వీటిని ప్రత్యామ్నాయంగా మజ్జిగ తాగడం వల్ల చాలా మేలు జరుగుతుందని చెబుతారు. మరి ముఖ్యంగా ఈ వేసవిలో మజ్జిగలో కొద్దిగా పుదీనా, ఇతర మసాలాలు కలపడం వల్ల ఇది మరింత రుచిగా ఆరోగ్యకరంగా ఉంటుంది. పుదీనా మజ్జిగ వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా, అనేక అనారోగ్య సమస్యలను నివారిస్తుంది.

### ఈ పుదీనా మజ్జిగ ఎలా తయారు చేయాలంటే..?

పెరుగు, పుదీనా ఆకులు, కొత్తిమీర ఆకులు, పచ్చి మిరపకాయలు, ధనియాలు, ఇంగువా(కొద్దిగా), ఉప్పు, చల్లటి నీరు

### తయారు చేసే విధానం..

పొయ్యి మీద పాన్ పెట్టాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, 3 టేబుల్ స్పూన్ల ధనియాలు వేయాలి. దీనిని బాగా వేయించిన తర్వాత.. చిటికెడు ఇంగువా వేసి వేయించాలి. మిక్సర్ గిన్నెలో, వేయించిన జీలకర్ర, ధనియాల మిశ్రమం, 4 టేబుల్ స్పూన్ల ధనియాల పొడి, ఒక పచ్చిమిర్చి, గుప్పెడు పుదీనా ఆకులు, రుచికి సరిపడా ఉప్పు, అర టేబుల్ స్పూన్ నల్ల ఉప్పు, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు వేసి.. వీటిని మెత్తని పేస్ట్‌గా గ్రైండ్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో దాదాపు పావు కేజీకిపైగా పెరుగు తీసుకోవాలి. అందులో ఇందాక మిక్సిలో వేసిన గ్రైండ్ చేసిన పదార్థాలను అందులో కలుపుకోవాలి. అందులో నాలుగున్నర కప్పుల (ఒక కప్పు పెరుగుకు మూడు కప్పులు) చల్లటి నీటిని పోసి.. బాగా కలపాలి. అంతే పుదీనా మజ్జిగ సిద్ధం.

# పడిక్కల్ ఊచకోత..

## ఆరంభ పోరులో సన్‌రైజర్స్ ఓటమి..!

ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఓటమి తప్పలేదు. భారీ స్కోర్ల మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్(61), విరాట్ కోహ్లీ(69 నాటౌట్)ల మెరుపులతో ఆర్సీబీ జయకేతనం ఎగురవేసింది. హైదరాబాద్ నిర్దేశించిన 202పరుగుల ఛేదనలో ఆరంభంలో ఫిలిప్ సాల్ట్(8) ఔటైనా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ పడిక్కల్ సునామీలా విరుచుకుపడ్డాడు. రజత్ పాటిదార్(31) ధనాధన్ ఆటకు కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్ తోడవ్వగా ఆర్సీబీ అలవోకగా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది.

పంతొమ్మిదో సీజన్ ఆరంభ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ పంజా విసిరింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. కొండంత ఛేదనలో దేవ్‌దత్ పడిక్కల్(61) ఊచకోతకు విరాట్ కోహ్లీ(69 నాటౌట్) క్లాస్ బ్యాటింగ్ తోడవ్వగా సన్‌రైజర్స్ బౌలర్లు బేజారయ్యారు. చిన్నస్వామి స్టేడియంలో పడిక్కల్, కోహ్లీ మెరుపులతో లక్ష్యం కరుగుతూ పోయింది. మూడో వికెట్‌కు పడిక్కల్‌తో 28 బంతుల్లోనే యాభై రన్స్ పిండుకున్న విరాట్ ఆ తర్వాత రజత్ పాటిదార్(31)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.మలింగ ఓవర్లో దూబే క్యాచ్‌తో పటిదార్ ఔటవ్వగా.. ఆ తర్వాతి బంతికే జితేశ్ శర్మ(0) సైతం వెనుదిరిగాడు. అయినా కోహ్లీ ఉండడంతో ఆర్సీబీ జట్టు కూల్‌గా ఉంది. హర్షల్ పటేల్ ఓవర్లో సిక్సర్, ఫోర్, ఫోర్ బాదిన కోహ్లీ జట్టును గెలిపించాడు. 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్న బెంగళూరు అదిరే బోణీ కొట్టింది. బౌలర్ల వైఫల్యంతో కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ ఓటమిని ఎదుర్కొన్నాడు.



### ఇషాన్, అనికేత్ దంచేయగా

పంతొమ్మిదో సీజన్ ఆరంభ పోరులో టాస్ ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆదిలో తడబడినా కోలుకుంది. టాపార్డర్ విఫలమైన చోట ఇషాన్ కిషన్(80 :38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. హెన్రిచ్ క్లాసెన్(31) జతగా 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ఇషాన్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు.

### అనికేత్ వర్మ(43), ఇషాన్ కిషన్(80)

అనంతరం అనికేత్ వర్మ(43: 18 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) నేనున్నాగా అంటూ తనమార్క్ విధ్వంసంతో ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఇషాన్, అనికేత్ మెరుపులతో ఆరెంజ్ ఆర్మీ ప్రత్యర్థికి 202 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

# ధోని అభిమానులకు బ్యాడ్ న్యూస్..


### ఐపీఎల్ 2026 నుంచి అవుట్!

మహేంద్ర సింగ్ ధోని అభిమానులకు పిడుగు లాంటి వార్త. ఐపీఎల్ 2026 మరికొన్ని గంటల్లో ఆరంభం కానున్న తరుణంలో సీఎస్కే నుంచి షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ధోని పిక్క గాయం బారిన పడ్డట్లు పేర్కొంది. దాంతో అతడు ఐపీఎల్ 2026 తొలి రెండు వారాలకు ధోని దూరం అయినట్లు పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదిక ద్వారా స్పష్టం చేసింది. ఈ రెండు వారాల పాటు అతడు పునరావాసంలో ఉండనున్నట్లుగా పేర్కొంది. ఇది ధోని అభిమానులకు బిగ్ షాక్ లాంటిదే. అతడు ఆడితే చూడాలనుకునే వారికి ధోని గాయం పెద్ద షాక్‌కు గురి చేసింది. గత కొన్ని రోజులుగా సీఎస్కే ఏర్పాటు చేసిన ప్రాక్టీస్ సెషన్స్‌లో ధోని చురుకుగా పాల్గొన్నాడు. భారీ షాట్స్ ఆడుతూ కనిపించాడు. అయితే తాజాగా ధోని గాయం బారిన పడటంతో రెండు వారాల పాటు ఐపీఎల్‌కు దూరం కావడం విచారకరం.ధోని గత కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. గత రెండు సీజన్లలో మోకాలి నొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. 2024 సీజన్‌లో అయితే గాయంతోనే ఐపీఎల్ ఆడాడు. అనంతరం మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. 2025లో ఎటువంటి గాయం లేకపోవడంతో 2024 కంటే కూడా ఫిట్‌గా కనిపించాడు. అయితే ఇప్పుడు పిక్క గాయం బారిన పడటంతో అతడి అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ధోని వయసు 44 ఏళ్లు. ఈ ఏజ్‌లో క్రికెట్ లాంటి గేమ్స్ ఆడటం శరీరాన్ని త్వరగా అలసిపోయేలా చేస్తుంది. ప్రస్తుతానికి ధోని కేవలం రెండు వారాల ఆటకు మాత్రమే దూరమైనట్లుగా సీఎస్కే తన ట్వీట్‌లో పేర్కొంది. అయితే వయసును పరిగణలోకి తీసుకుంటే అది కష్టమనే చెప్పాలి. సీఎస్కే తన తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 3న ఆడనుంది. రెండు వారాల్లో అతడు



కోలుకుంటే ఏప్రిల్ 11 లేదా 14న జరిగే మ్యాచ్‌తో అతడు రీ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. సీఎస్కే మేనేజ్‌మెంట్ ఇచ్చిన సమాచారాన్ని బట్టి అతడు తన టీమ్ ఆడే తొలి 3 మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది.టీమిండియా తరఫున మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గాడు. ప్రస్తుతం 44 ఏళ్లు. ధోనికి క్రికెట్‌లో సాధించాల్సింది ఏముంది? ఏం లేదు.. హాయిగా రిటైర్మెంట్ ఇవ్వకుండా తన ఆరోగ్యాన్ని పాడుచేసుకోడం ఎందుకు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 2024లో మోకాలి గాయం కారణంగా ధోని చాలా ఇబ్బంది పడ్డాడు. 2022 నుంచి కూడా ధోనికి ఇదే చివరి సీజన్ అంటూ ఐపీఎల్ ఆరంభం అయ్యే ప్రతిసారి ప్రచారం జరుగుతూనే ఉంది. అయితే ధోని మాత్రం ఐపీఎల్‌కు రిటైర్ అవ్వలేదు. ధోని రిటైర్ అయితే అది సీఎస్కేకు పెద్ద దెబ్బే. అందుకే ధోని తర్వాత సీఎస్కేకు ఎవరనే ప్రశ్నకు సంజూ సామ్సన్ రూపంలో సమాధానం దొరికింది. చూస్తుంటే ధోనికి ప్లేయర్‌గా ఇదే చివరి సీజన్ అయ్యేలా ఉంది.

# రోహిత్ శర్మను చూసి ఆశ్చర్యపోయిన నీతా అంబానీ



ముంబై ఇండియన్స్ శిక్షణ శిబిరంలో ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో జట్టు యజమాని నీతా అంబానీ ప్రాక్టీస్ సెషన్‌ను పరిశీలించడానికి వచ్చారు. అక్కడ రోహిత్ శర్మను చూడగానే ఆమె ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. రోహిత్ గతంతో పోలిస్తే చాలా బరువు తగ్గడమే కాకుండా, ఎంతో చురుగ్గా కనిపిస్తున్నారు. ఆయనను చూడగానే నీతా అంబానీ స్పందిస్తూ.. "మై గాడ్ రోహిత్! నేను నిన్ను గుర్తుపట్టలేకపోయాను. నువ్వు అచ్చం ఒక కుర్రాడిలా కనిపిస్తున్నావు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోను ముంబై ఇండియన్స్ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో పంచుకుంది. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లక్షలాది వ్యూస్ సాధించింది. రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై పెట్టిన శ్రద్ధను చూసి నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. 2026 సీజన్ కోసం రోహిత్ మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా ఎంతో సిద్ధంగా ఉన్నారని ఈ వీడియో స్పష్టం చేస్తోంది.ముంబై ఇండియన్స్ తన తొలి మ్యాచ్‌ను మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది. సొంత మైదానమైన వాంఖడే స్టేడియంలో జరగనున్న ఈ పోరులో రోహిత్ శర్మ కొత్త అవతారంలో బరిలోకి దిగనున్నాడు. గత సీజన్లలో ఫిట్‌నెస్‌పై వచ్చిన విమర్శలకు సమాధానం చెబుతూ, ఈసారి భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని రోహిత్ కృతనిశ్చయంతో ఉన్నాడు. హార్దిక్ పాండ్యా సారథ్యంలో రోహిత్ ఓపెనర్‌గా జట్టుకు ఎలాంటి ఆరంభాన్ని ఇస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ముంబై జట్టు ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలవడంలో రోహిత్ పాత్ర ఎంతో కీలకం. ఇప్పుడు సారథ్య బాధ్యతలు లేకపోయినా, ఒక సీనియర్ ఆటగాడిగా జట్టును నడిపించే బాధ్యత ఆయనపై ఉంది. నీతా అంబానీ అన్నట్లుగా, రోహిత్ మళ్ళీ తన కెరీర్ ఆరంభ రోజుల్లో ఉన్నంత ఫిట్‌గా కనిపిస్తుండటం జట్టుకు సానుకూల అంశం.

## కెప్టెన్‌గా చరిత్ర సృష్టించనున్న ఇషాన్ కిషన్



వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ సారథ్యంలో సన్‌రైజర్స్ బరిలోకి దిగనుంది. ఐపీఎల్ చరిత్రలో ఇషాన్ కిషన్‌కు కెప్టెన్‌గా ఇదే తొలి మ్యాచ్ కానుంది. ఈ నేపథ్యంలో అతడు ఓ అరుదైన రికార్డును అందుకోనున్నాడు.ఫస్ట్ మ్యాచ్‌లో ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ టీమ్స్ తలపడనున్నాయి. అయితే సన్ రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయపడడంతో.. విధ్వంసరకర బ్యాటర్ ఇషాన్ కిషాన్ కెప్టెన్సీలో ఎస్ఆర్‌హెచ్ ఆడనుంది. ఇషాన్‌కి ఐపీఎల్ హిస్టరీలోనే ఫస్ట్ మ్యాచ్ ఇది. ఈ క్రమంలో ఈ స్టార్ బ్యాటర్ ఓ అరుదైన రికార్డును సృష్టించనున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహించిన అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించనున్నాడు. ప్రస్తుతం ఇషాన్ వయసు 27 ఏళ్ల 253 రోజులు. ఇక ఓవరాల్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అతి పిన్నవయసులో కెప్టెన్సీ వహించిన రికార్డు కివీస్ ఆటగాడు కేన్ విలియమ్సన్ పేరిట ఉంది. అతడు 27 ఏళ్ల 244 రోజుల వయసులో అంటే 2018లో ఎస్ఆర్‌హెచ్‌కు నాయకత్వం వహించాడు. ఇప్పటి వరకు శిఖర్ ధావన్, మనీష్ పాండే, భువనేశ్వర్ కుమార్ లు మాత్రమే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించిన భారత ఆటగాళ్లు. షాన్ కిషన్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా నియమించాలన్న జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయం పై ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి సంతోషాన్ని వ్యక్తం చేశాడు. అతడు ఆత్మవిశ్వాసం గల ఆటగాడని, నాయకుడిగా తనను తాను నిరూపించుకున్నాడని చెప్పుకొచ్చాడు.ఇషాన్ కిషన్ అండర్-19 జట్టుకు, దేశవాళీలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తన రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో నాయకుడిగా తన జట్టుకు టైటిల్ అందించాడు.

## కొన్ని రికార్డులు బద్దలు కొట్టడం అసాధ్యమే!



2008లో ప్రారంభమైన ఈ లీగ్ ప్రతి సీజన్‌లోనూ ఒక కొత్త మైలురాయిని చేరుకుంటోంది. ప్రతి సీజన్‌లో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. లీగ్‌లో నమోదైన కొన్ని రికార్డులు ఎన్నేళ్లు గడిచినా చెక్కుచెదరకుండా ఉన్నాయి. 2026లో కూడా అవి అలాగే ఉండే అవకాశం ఉంది. ఇందులో విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ మధ్య నమోదైన భారీ భాగస్వామ్యం , ఒకే ఓవర్‌లో 37 పరుగులు సహా పలు రికార్డులు ఉన్నాయి. ఐపీఎల్ చరిత్రలో 10 ఆల్‌టైమ్ రికార్డులు ఇక్కడ అందిస్తున్నాం. వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ క్రిస్ గేల్ ఐపీఎల్‌లోనూ మ్యాజిక్ చేశాడు. టీ20 ఫార్మాట్ రారాజు, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ తను. ఐపీఎల్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగుల రికార్డు గేల్ పేరిట ఉంది. ఆ ఇన్నింగ్స్‌లో గేల్ ఏకంగా 17 సిక్సర్లు బాదాడు. పూణే వారియర్స్ పై ఆడిన ఈ ఇన్నింగ్స్‌లో పలు రికార్డులు నమోదయ్యాయి. ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు.వేగవంతమైన సెంచరీ కూడా 'యూనివర్స్ బాస్' క్రిస్ గేల్ పేరిట ఉంది. క్రిస్ గేల్ 23 ఏప్రిల్ 2013న పూణే వారియర్స్ పై జరిగిన మ్యాచులో కేవలం 30 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో నేటికీ ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. గత సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ మెరుపు సెంచరీ బాదినప్పటికీ, అతను కూడా ఈ రికార్డును బద్దలుకొట్టలేదు. 35 బంతుల్లో సెంచరీ పూర్తి చేసి, ఐపీఎల్‌లో రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ ఐపీఎల్‌లో అతిపెద్ద భాగస్వామ్యం నెలకొల్పారు. 14 మే 2016న గుజరాత్ లయన్స్ పై 229 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో రికార్డులు తిరగరాశారు. కోహ్లీ, డివిలియర్స్ ఇద్దరూ సెంచరీలు చేశారు. ఆ మ్యాచ్‌లో డివిలియర్స్ 52 బంతుల్లో 129 పరుగులు, కోహ్లీ 55 బంతుల్లో 109 పరుగులతో చెలరేగారు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ రికార్డు రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్ యశస్వి జైస్వాల్ పేరిట ఉంది. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ 11 మే 2023న కోల్‌కతా నైట్ రైడర్స్ పై కేవలం 13 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. విరాట్ కోహ్లీ పేరిట చెక్కుచెదరని ఈ రికార్డును అధిగమించడం దాదాపు చాలా కష్టం. కోహ్లీ 2016 సీజన్‌లో 973 పరుగులు చేశాడు. 2016 ఎడిషన్‌లో అద్భుత ఫాంలో ఉన్న కోహ్లీ 4 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలు చేశాడు. తరువాత గిల్ 2023లో 890 పరుగులు చేసి ఈ రికార్డును బద్దలు కొట్టేంత దగ్గరకు వచ్చాడు.ఐపీఎల్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు రవీంద్ర జడేజా, క్రిస్ గేల్ పేరిట ఉంది. గేల్ ఆర్‌సిబి తరపున ఆడుతూ 2011లో కొచ్చి టస్కర్స్ బౌలర్ పరమేశ్వరన్ ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. 2021లో సిఎస్‌కె తరపున ఆడుతూ జడేజా ఆర్సీబీపై హర్షల్ పటేల్ ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ బౌలింగ్ స్పెల్ వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ అల్జారీ జోసెఫ్ పేరిట ఉంది. తన అరంగేట్రం మ్యాచ్‌లోనే ఈ ఘనత సాధించాడు.

# చెల్లి నిర్మాత...అన్న హీరోగా బరిలోకి

### వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

### హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో



దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. రిషబ్ శెట్టి ఈ అంశంపై స్పందించే వరకు ఈ సస్పెన్స్ కొనసాగడం ఖాయం.



# అనిరుధ్ -- కావ్య మారన్ పెళ్లి?

### కోలీవుడ్ మీడియాలో సెన్సేషనల్ న్యూస్..

సౌత్ సినీ ఇండస్ట్రీలో ఒకరు మ్యూజిక్ సెన్సేషన్.. మరొకరు బిజినెస్ సామ్రాజ్యానికి వారసురాలు. ఇప్పుడు వీరిద్దరి చుట్టూ ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్యా మారన్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తోంది. గత కొద్ది రోజులుగా తమిళ మీడియాలో ఈ వార్త తెగ హల్‌చల్ చేస్తోంది. అనిరుధ్, కావ్యా మారన్ మధ్య సాన్నిహిత్యం ఎప్పటి నుంచో ఉంది. అనిరుధ్ తన కెరీర్‌లో అత్యధిక విజయవంతమైన చిత్రాలను సన్ పిక్చర్స్ బ్యానర్‌లోనే అందించారు. రజనీకాంత్ జైలర్ నుంచి విజయ్ లియో వరకు సన్ నెట్‌వర్క్ నిర్మించిన సినిమాలకు అనిరుధ్ అందించిన మ్యూజిక్ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ క్రమంలోనే కావ్యా మారన్ తో అనిరుధ్ కు పరిచయం ఏర్పడిందని, అది కాస్తా ప్రేమగా మారిందని టాక్. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోసం అనిరుధ్ ప్రత్యేకంగా సాంగ్ కంపోజ్ చేయడం కూడా ఈ రూమర్లకు మరింత బలాన్ని చేకూర్చింది. ఈ ఏడాది జూన్ నెలలో అనిరుధ్, కావ్యా మారన్ కలిసి విదేశాల్లో తిరుగుతున్నట్లు కొన్ని ఫోటోలు రెడిట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కనిపించాయి. వీరు కలిసి లాస్ వెగాస్ వీధుల్లో షికారు చేశారని, కొన్ని ఖరీదైన రెస్టారెంట్లలో డిన్నర్ డేట్‌లకు వెళ్లారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఈ ఫోటోలు బయటకు వచ్చినప్పటి నుండి వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారనే వార్తలకు రెక్కలు వచ్చాయి. తాజాగా వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయని, త్వరలోనే నిశ్చితార్థం ఉండబోతోందని కోలీవుడ్ వర్గాల సమాచారం.

# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

### మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన



బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్ లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.


# దురంధర్-2 ఓ చెత్త సినిమా

### అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ



ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు.ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609